క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మొదటి విడతలో భాగంగా 12 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య, ఉపాధ్యక్షుడు వార్ల తిరుపతి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కస్తూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన 'ధమ్మచక్ర ప్రబోధన్' భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జెత్వాన్ బుద్ధ విహార్‌లో నూతనంగా నిర్మించిన ధమ్మ చక్ర ప్రబోధన్ (ప్రవచన) భవనాన్ని భారతీయ బౌద్ధ మహాసభ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆషాఢమాసం నుంచి అశ్వినీ మాసం వరకు 90 రోజుల పాటు వర్షవాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, నాయకులు దుర్గం సునీల్, రోషన్ ఉప్రే, విజయ్ ఉప్రె, శ్యాంరావు, పాండు, దీక్షిత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన తహసీల్దార్ జ్యోత్స్న బదిలీ

రెబ్బెన: రెబ్బెన తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోత్స్న ఆదివారం బదిలీ అయ్యారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా మంచిర్యాల జిల్లా నుంచి రెబ్బెనకు ఆమె బదిలీపై వచ్చారు. తిరిగి మంచిర్యాల జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

కాగజ్‌నగర్‌రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్ఆర్‌వో కాలనీలో గల రేణుక మాత ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకంతో పాటు కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రంగయ్య దంపతులకు సన్మానం



రంగయ్య దంపతులను సన్మానిస్తున్న నేతలు

కెరమెరి: గురుపౌర్ణమి, దాశరథి జయంతి సందర్భంగా మండలంలోని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సావర్‌కెడా ప్రధానోపాధ్యాయుడు కడేర్ల రంగయ్య, వీణ దంపతులను ఆదివారం ఆసిఫాబాద్‌కు చెందిన అకసం(ఆసిఫాబాద్ కవుల సంఘం) నేతలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాంపల్లి శంకర్, వాంకిడి ఎంఈవో మనుకుమార్, అకసం అధ్యక్ష, కార్యదర్శులు నల్లగొండ రమేశ్, శ్రీరాము సత్యనారాయణ, గుర్రాల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



నిరసన తెలుపుతున్న బారెగూడ గ్రామస్తులు

చింతలమానెపల్లి: ఏటా వర్షాకాలం వచ్చిందంటే నడక కూడా నరకంలా మారుతున్న గ్రామీణ రహదారులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ బారెగూడ గ్రామంలో రహదారులు బురదగా మారాయి. దీంతో గ్రామస్తులు ఆదివారం రోడ్లపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో మురికి కాలువలు లేవని, క్లోరినేషన్ చేయడం లేదని ఆరోపించారు. వరద నీరు ఇళ్లలోకి చేరి పాములు, విషపురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం లేక జ్వరాలు వస్తున్నాయని పేర్కొన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



లింగాపూర్ బ్రిడ్జి దగ్గర గుంతల్లో నిలిచిన నీరు



బురదమయంగా పిక్లాతండా -కొత్తపల్లి రోడ్డు



నాగుగూడ లోలెవల్ బ్రిడ్జి



వరదలతో కొట్టుకుపోయిన కిమానాయక్‌తండా బ్రిడ్జి

అస్తవ్యస్తంగా గిరి గ్రామాల రోడ్లు

లింగాపూర్ మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. మండలకేంద్రం పరిధి పెద్దవాగు వద్ద అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి దగ్గర రోడ్డుపై గుంతలు పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నాగుగూడ లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకోగా వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పిక్లాతండా నుంచి కొత్తపల్లి వరకు వెళ్లే మట్టి రోడ్డు బురదతో నిండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లింగాపూర్ నుంచి జాముల్‌ధరా, పూల్‌సింగ్ తండా, కిమానాయక్‌తండా, దంపూర్, ఎల్లాపటార్, పంగిడి మాధుర గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. అధికారులు స్పందించి రోడ్ల సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- లింగాపూర్

అభివృద్ధికి దూరంగా మురళీగూడ

- రాళ్లు తేలిన రహదారి
- గ్రామస్తులకు కాలినడకే శరణ్యం
- అత్యవసర పరిస్థితుల్లో తిప్పలు

పెంచికల్‌పేట్: గిరి గ్రామాల్లో మౌలిక వసతులు, రోడ్లు, రవాణా వ్యవస్థలను మెరుగుపర్చడానికి నిధులు విడుదల చేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో గిరి ప్రజల సమస్యలు తీరడం లేదు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా తమ తలరాతలు మారడం లేదని మండలంలోని మురళీగూడ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1350 మంది జనాభా ఉన్న గ్రామానికి నేటికీ పక్కా రోడ్డు లేక అత్యవసర పరిస్థితుల్లో బండరాళ్లు తేలిన రహదారిపై అనేక కష్టాలు పడుతున్నారు.

గుట్టపైన కాలినడకే..

భారీ వర్షాలకు గుట్టపైన ఉన్న తాత్కాలిక రహదారిపైన పెద్ద గుంతలు ఏర్పడి బండరాళ్లు తేలాయి. దీంతో ద్విచక్రవాహనాలు సైతం నడవలేని పరిస్థితి ఏర్పడింది. నిత్యావసర సరుకుల కోసం సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెంచికల్‌పేట్, బెజ్జూర్ మండల కేంద్రాలకు చేరుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర సరుకులను చేత పట్టుకొని 5 కిలోమీటర్లు గుట్టపైన కాలినడకన ప్రయాణం చేసి గ్రామానికి చేరుకుంటున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. 15రోజుల కిత్రం గుట్టపైన వెళ్తున్న బొలెరో వాహనం బోల్తాపడటంతో కనీసం 108 వాహనం వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బురదమయంగా మారిన రహదారిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం కొనసాగిస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.



మురళీగూడ గ్రామానికి వెళ్లే రహదారి

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుపైన పెద్ద కాలువలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనాలు సైతం నడవలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– తలండి మధుకర్, మురళీగూడ

అత్యవసర సేవలు అందడం లేదు



అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం 5 కిలోమీటర్లు కాలినడకన కమ్మర్‌గాం గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి బెజ్జూర్‌కు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నాం. ఏళ్లు గడిచినా తమకు ఇప్పటికీ అత్యవసర సమయంలో వైద్యం అందడం లేదు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి.

– తొర్రెం రాజేశ్వర్, మురళీగూడ

వారసంత.. చిత్తడితో చింత



కెరమెరి: మండల కేంద్రంలో కొనసాగుతున్న వారసంత సమస్యలతో సతమతమవుతోంది. ఆదివారం కురిసిన వర్షంతో వారసంత ప్రాంతం చిత్తడిగా మారింది. దీంతో కూరగాయలు కొనుగోలుదారులు, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ రైల్వేగేట్ సమీపంలో ఆదివారం సాయంత్రం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లేతన్‌గూడ రైల్వేగేట్ సమీపంలో ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వెళ్లే ట్రైన్ కిందపడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడికి 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఒంటిపై నేవీ బ్లూ కలర్ ఆఫ్ టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని సిర్పూర్ (టి) మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712658596, 9948481902 లలో సంప్రదించాలని కోరారు.

మున్నూరుకాపు సంఘం ప్రచార కార్యదర్శిగా సంతోష్

కాగజ్‌నగర్‌రూరల్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎమ్మాజీ సంతోష్ కుమార్ పటేల్ నియమితులయ్యారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారాం మంచిర్యాలలోని తన నివాసంలో నియామకపత్రం అందజేశారు.



నియామకపత్రం అందజేస్తున్న రాజారాం పటేల్

ఎడతెరిపి లేని వర్షం



చింతలమానెపల్లి: గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్‌ను వాగులో మోసుకొని వెళ్తున్న గ్రామస్తులు



కౌటాల: కన్నెపల్లి చెరువు వద్ద మత్తడి దూకుతున్న వరద

- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చింతలమానెపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. ఆదివారం వర్షం ఏకధాటిగా కురవడంతో వాగుల్లో వరద ఉధృతి పెరిగింది. మండలంలోని నాగుల్వాయి వాగు ఉధృతితో బాబాసాగర్ గ్రామ పంచాయతీ నాయకపుగూడ గ్రామానికి, ఇతర వాగులు ఉప్పొంగడంతో దిందా, శివపెల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నాయకపుగూడలో ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదవశాత్తు గాయాలపాలు కాగా గ్రామస్తులు వాగులో మోసుకుంటూ ఆస్పత్రికి తరలించారు. మండలంలో వర్షాలతో వరి నాట్లు ముమ్మరంగా సాగుతుండగా పత్తి మొక్కలు నీటిలో మునిగిపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలో 67.1 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా మండలంలోని గూడెం వద్ద ప్రాణహిత నది, బాబాసాగర్ నాయకపుగూడ, శివపెల్లి, దిందా వాగు వంతెనలను మండల అధికారులు, పోలీసులు పరిశీలించారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వాగులు, చెరువులు ఉప్పొంగి ప్రవహించాయి. భారీ వర్షం కారణంగా ప్రాణహిత నది వరదనీటితో ఉప్పొంగింది. పుష్కరఘాట్ వద్దకు నీరు చేరింది. ఉదయం నుంచే వర్షం కురవడంతో రైతులు, ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా కన్నెపల్లి చెరువులో వరద నీరు మత్తడి దూకింది. దీంతో స్థానికులు చేపలు పట్టేందుకు పరుగులు తీశారు. కౌటాల- చింతలమానెపల్లి ప్రధాన రహదారిపై గల చింతలపాటి ఒర్రె వంతెనను తాకుతూ ప్రవహించింది.



పెంచికల్‌పేట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

కెరమెరిలో..

కెరమెరి: గడిచిన మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని లక్మాపూర్, అనార్‌పల్లి వాగులు పొంగి ప్రవహించడంతో వాగు అవతల 13 గ్రామాలకు చెందిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం వారసంత కావడంతో ప్రజలు అష్టకష్టాల మీద వాగు దాటి కెరమెరికి వచ్చి నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి గ్రామాలకు వెళ్లారు. ప్రజలు వాగు దాటకుండా పోలీసులు కాపలా ఉన్నప్పటికీ అవసరాల నిమిత్తం ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెద్దవాగు, బొక్కివాగు, ఉచ్చమల్లవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద వాగుకు వరద పోటెత్తింది. బొక్కివాగు మత్తడి పొంగి ప్రవహిస్తుండటంతో మెరెగూడ ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయారు. మురళీగూడ వద్ద ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తుంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కౌటాల: మండలంలోని భక్తులు ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటాల సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. అలాగే మండలంలోని గుండాయిపేట గ్రామంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, రైతులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, కమిటీ సభ్యులు శైలేష్, మౌనిశ్, వినాయక్‌గౌడ్, సుక్రుజీ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ఖర్జెల్లి గ్రామంలోని ఓంకార ఆశ్రమం, గీతా మందిర్‌లలో గ్రామస్తులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గీతా పారాయణం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదవ్యాసుడి ఉపదేశాలను బోధించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



ఓంకార ఆశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు

సిద్ధేశ్వర సంస్థాన్‌లో..

జైనూర్: బాబా హితబోధనలతో ఎంతో మంది ప్రభావితులై ఉన్నతమైన బాటలో నడుచుకుంటున్నారని పూలాజీబాబా తనయుడు వామన్ ఇంగిళే అన్నారు. ఆదివారం మండలంలోని పట్నాపూర్ గ్రామంలోని సిద్ధేశ్వర సంస్థాన్‌లో గురుపౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా పల్లకి ఊరేగింపు చేపట్టారు. జ్యోతి ప్రజ్వలన చేసి ధ్యాన ధారణ చేపట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి శ్యామనాయక్, మంచిర్యాల డీటీడీవో గంగారాం, ఆదిలాబాద్ జిల్లా సార్మేడి మెస్రం దుర్గు పటేల్, సిద్ధేశ్వర సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగిళే, సతీశ్ గురునుళే, గ్రామ పటేల్ రంగారావు, భక్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా రామారావు మహరాజ్ జయంతి

కెరమెరి: మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా రామారావు మహరాజ్ 89వ జయంతిని బంజార భక్తులు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్ మాట్లాడారు. లక్షలాది మంది చెడువ్యసనాల నుంచి విముక్తి చేసిన మహనీయుడు తపస్వీ రామారావు మహరాజ్ అని అన్నారు. నిరంతరం బలమైన సమాజం నిర్మాణానికి తాను కృషిచేశాడని కొనియాడారు. సేవాలాల్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్, నాయకులు వెంకట్‌నాయక్, ఉత్తం, ధారావత్ లాలూ, జాటోత్ తిరుపతిదేవ్‌జీ, సుదర్శన్, బాబు, బలిరాం తదితరులు ఉన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలో ఆదివారం జగదాంబదేవి ఆలయంలో భక్తులు శ్రీ రామరావు మహరాజ్ జయంతి, గురుపౌర్ణిమ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన సంకీర్తనలు నిర్వహించారు. కిరణ్ నాయక్, నరేందర్, పృథ్వీరాజ్, బీమా మహరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.



కెరమెరి: పూలమాల వేస్తున్న నాయకులు

బుద్ధవిహార్‌లో..

మండల కేంద్రంలోని కరుణా బుద్ధవిహార్‌లో ఆదివారం వర్షఉపాస్ ప్రారంభ త్రిశరణ్ పంచశీల కార్యక్రమాన్ని కరుణ బుద్ధమహిళా మండలి బౌద్ధ ఉపాసికలు నిర్వహించారు.

వైద్యం కోసం దాతల ఆర్థికసాయం

బెజ్జూర్: మండలంలోని గోల్కొండ వీధికి చెందిన చటారి రవి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం పలువురు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. మండలానికి చెందిన జావిద్ వాట్సప్ గ్రూపులలో రవి వైద్యం కోసం సహకరించాలని కోరగా దాతలు స్పందించారు. వైద్య ఖర్చుల కోసం దాతలు అందజేసిన ఆర్థిక సహాయాన్ని ఆదివారం రవి కుటుంబ సభ్యులకు అందజేశారు. మాలి సంఘం నాయకులు కావిడే సురేశ్, కావిడె అంజి, సెండె సాయి, నికూరి అంజి, గోల్కొండ యువకులు అప్పల కిరణ్, తాళ్ల గణేశ్, చింతకుంట్ల విజ్జు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గంజాయి పట్టివేత

జైనూర్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. జైనూర్ నుంచి ధనోరకు వెళ్తున్న ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం వాహనాల తనిఖీలు చేపడుతుండగా జైనూర్ నుంచి ధనోరకు వెళ్తున్న కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.30,000 విలువ చేసే గంజాయిని పట్టుకొని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్సై

'అవినీతికి ఆస్కారం లేకుండా ఆర్థిక సాయం'

కాగజ్‌నగర్‌రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా ఆర్థికసాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం సర్‌సిల్క్‌లోని తన నివాసంలో 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా, పారదర్శకంగా ఆర్థికసాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే వంద మందికిపైగా లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, నాయకులు గణపతి, తిరుపతి, బిక్షపతి, ప్రసాద్, భగవంత్, కిరణ్, రాజు, సుమన్, బాబురావు, శ్రీను పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

'ప్రమాదకరంగా అడ ప్రాజెక్టు'

ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం (అడ) ప్రాజెక్టు ప్రమాదకరంగా ఉందని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. ఆదివారం అడ ప్రాజెక్టు బీటలు బారిన ఆనకట్టను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నాసిరకంగా పనులు చేపట్టడంతో ప్రాజెక్టు ఆనకట్ట పగుళ్లు తేలి బీటలు వారిందన్నారు. అయినా ఇప్పటి వరకు మరమ్మతులు నిర్వహించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేపట్టి కాలువలు ఏర్పాటు చేసి సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న నాయకులు